క్లుప్తంగా

నేడు మల్లాపూర్‌లో చాందినీ క్రికెట్ టోర్నీ

మల్లాపూర్: మల్లాపూర్ శాంతి యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదిన సందర్భంగా శనివారం రాత్రి చాందినీ క్రికెట్ టోర్నీని శాంతి యూత్ క్లబ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాజేష్, రఘు, శశి తెలిపారు. ఈ టోర్నీలో పాల్గొనే టీమ్‌లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ఈ క్రికెట్ టోర్నీలో విన్నర్ టీమ్‌కి రూ.15 వేలు, రన్నర్‌గా నిలిచినవారికి రూ.5 వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఫోన్: 99634 44630, 79899 29259, 79951 26012.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు



గ్రాసంపై వివరిస్తున్న సైంటిస్టులు

బోడుప్పల్: బోడుప్పల్‌లో కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ(సీమ్యాప్) ఆధ్వర్యంలో 3 రోజులపాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది పాల్గొనగా కేంద్ర ఇన్‌చార్జి శాస్త్రవేత్త జి.డి.కిరణ్‌బాబు శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో సుగంధ మొక్కల సాగులో ఆదాయాన్ని పెంపొందించడంపై, సుగంధ ద్రవ్యాలు తయారు చేసే ఆయిల్స్ ఎగుమతులు పెంచడానికి దేశం అవలంభిస్తున్న విధానాలను వివరించారు. ఇండియా స్థాయిలో నిమ్మగడ్డి, పాల్మరోసా, తులసి, పుదీనా, జెరేనియం వెటివర్, యూకలిప్టస్, అశ్వగంధ ఔషధ ఉత్పత్తుల్లో దేశం గణనీయంగా పురోగతి సాధించిందన్నారు. కార్యక్రమంలో సైంటిస్టులు సంజయ్‌కుమార్, సుదీప్ తండన్, ఎన్‌పి యాదవ్, కోటేశ్‌కుమార్, కేవీఎస్ఎస్ శ్రీనివాస్, జ్ఞానేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణంలో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలోని శ్రీమల్లిఖార్జున స్వామి దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తూ రాష్ట్రంలో ఆధ్యాత్మిక వాతావరణంలో నెలకొల్పిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వెల్లంకి నరేందర్, ప్రధాన అర్చకులు మోత్కూరు శేఖర్‌బాబు శర్మ, మాజీ చైర్మన్ దయాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, రాజు, శంకర్, మహేందర్, గరిక సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న దేవాలయంలో హోమం



గౌతంనగర్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గౌతంనగర్ డివిజన్ పరిధిలోని శివాలయాలు వైభవంగా ముస్తాబయ్యాయి. మల్లికార్జునగర్‌లోని మల్లన్న దేవాలయం, గౌతంనగర్‌లోని దుర్గాభవానీ ఆలయం, వాణీనగర్‌లోని విజయ వినాయక ఆలయాల్ని అందంగా ముస్తాబు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. మల్లికార్జునగర్ మల్లన్న దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కమనీయం సీతారాముల కల్యాణం

నల్లకుంట: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నల్లకుంట పాత రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం అర్చక పురోహిత స్వాములు అనంతాచారి, చక్రి, శ్రీనివాసాచార్య, శ్రీహరి ఆచార్యులు వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీఎం కేసీఆర్ గురువు మృత్యుంజయశర్మ, అంబర్‌పేట, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, పిట్ల విశాల్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు.

శివా.. శ్రీరామలింగేశ్వరా..



- కీసరగుట్టలో కనుల పండువగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- రెండో రోజు శ్రీభవానీ రామలింగేశ్వరుడికి విశేష పూజలు
- నేడు మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి పెరిగిన భక్తుల తాకిడి



కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. వైదిక కార్యక్రమాల సంధానకర్త పుల్లేటికుర్తి గణపతిశర్మ ఆధ్వర్యంలో టీటీడీ వేద పాఠశాల విద్యార్థులు యాగశాల్లో యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వామివారికి ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ అభిషేకం, సాయంత్రం స్వామివారికి వేదపండితులు బిల్వార్చన పూజ, గురువారం కీసర గ్రామానికి విచ్చేసిన స్వామివారిని కనుల పండువగా గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవానికి కీసరగుట్టకు స్వామివారిని ఊరేగింపుగా తిరిగి తీసుకెళ్లారు.

మహాశివరాత్రికి కదలిన భక్త జనం..

నేడు(శనివారం) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకునేందుకు నగరం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆటోలు, సొంత వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో కుటుంబ సమేతంగా కీసరగుట్టకు చేరుకుంటున్నారు. కాగా గతంలో ఎడ్ల బండ్ల మీద కీసరగుట్టకు చేరుకునే యాప్రాల్, అమ్ముగూడ తదితర ప్రాంతాలకు చెందిన తమిళులు, ఎడ్ల బండ్లతో పాటు ఆటోలు, సొంత వాహనాల్లో గుట్టకు చేరుకున్నారు.

కళకళలాడిన పోచమ్మ అంగడి...

మహాశివరాత్రి ముందురోజు ప్రతియేట కీసరలో జరిగే పోచమ్మ అంగడి శుక్రవారం ఆనందోత్సవాల నడుమ జరిగింది. కాప్రా, యాప్రాల్ నగరం నలుమూలల నుంచి ముఖ్యంగా తమిళులు వివిధ వాహనాల్లో కీసరకు చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తమ సాంప్రదాయాన్ని పాటిస్తూ ఎడ్ల బండ్లపై కీసరకు చేరుకుని పోచమ్మకు పూజలు చేసి అనంతరం కీసరగుట్టపైకి చేరుకున్నారు.

పటిష్ట బందోబస్తు...

బ్రహ్మోత్సవాల సందర్భంగా గుట్టలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో జాతర జరిగే ప్రాంతమంతా విస్తృతంగా తనిఖీలు చేశారు.

నేడు మహాశివరాత్రి పూజల వివరాలు...


మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయంలో ఉదయం 4 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఉదయం 6 గంటల నుంచి సాముహిక అభిషేకాలు, 9 గంటలకు రుద్ర స్వాహాకార హోమం, రాత్రి 8 గంటలకు నందివాహన సేవ, రాత్రి 10 గంటలకు భజనలు, రాత్రి 12 గంటలక రామలింగేశ్వరుడికి సతత ధారాభిషేకము (లింగోద్భవ కాలములో) నిర్వహించనున్నారు.

విద్యుత్ కాంతులతో విరాజిల్లుతూ...

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ కాంతులతో కొత్త అందాలను తీసుకువచ్చారు. ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం లోనూ రంగు రంగుల విద్యుద్దీపాలతో కీసరగుట్ట ప్రాంగణాన్ని శోభాయమాణం చేశారు.

కొనసాగుతున్న క్రీడలు...

కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల జిల్లా స్థాయి క్రీడలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గుట్టలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ సమీపంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్ క్రీడల్లో తలపడుతున్నారు. పోటీలను తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు.



మూలవిరాట్‌కు పూజలు..



కొనసాగుతున్న క్రీడాపోటీలు



యజ్ఞశాలలో కలశ పూజ

శివరాత్రికి శైవక్షేత్రాలు సిద్ధం

- పూలు, పండ్లతో మార్కెట్లు కిటకిట
- విద్యుత్ కాంతులతో ఆలయాల అలంకరణ
- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీల ఏర్పాట్లు

మేడ్చల్: ఉపవాస దీక్షలు ఉండి పరమశివుడిని అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిసే మహాశివరాత్రి పండగకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలను శుద్ధి చేసి పూలు, పచ్చటి తోరణాలతో.. విద్యుత్ కాంతులతో.. అందంగా అలంకరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అత్వెల్లిలోని చందరమౌళేశ్వర, రాజరాజేశ్వరి, మేడ్చల్ కీసరగుట్ట శ్రీభావానీ రామలింగేశ్వర, కేఎల్ఆర్ మల్లికార్జున తదితర ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు.

మార్కెట్లు కిటకిట...

ఉపవాస దీక్షలు తీసుకుని సాయంత్రం పండ్లు తినే సంప్రదాయం ఉంటడంతో మార్కెట్‌లో పండ్లకు విపరీతంగా గిరాకీ పెరిగింది. పండ్లను మాములు రోజుల కన్నా రెట్టింపు ధరలకు వ్యాపారులు విక్రయించారు. కొనుగోలుదారులతో మార్కెట్లలో పండగ శోభ సంతరించుకుంది.



మేడ్చల్ మార్కెట్‌లో పండగ సందడి

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

ఉప్పల్: కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా శుక్రవారం నిర్వహించారు. పలుచోట్ల ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి ఉత్సవాలు జరుపుకున్నారు. ఉప్పల్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు పండ్లను ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా.సౌందర్యలత, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. చిలుకానగర్ చౌరస్తాలో కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద..

మల్కాజిగిరి: సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు క్యాంపు కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. కేక్ చేసిన అనంతరం అన్నదానం నిర్వహించారు.

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మేయర్ క్యాంప్ కార్యాలయంలో కేక్‌కట్ చేసి ఉత్సవాలను జరిపారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



కేక్ కట్ చేస్తున్న పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి తదితరులు

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

ఉప్పల్: సులభంగా డబ్బులు సంపాదించేందుకు ముగ్గురు స్నేహితులు గంజాయికి బానిసలుగా మారి, గంజాయిని విక్రయిస్తూ పోలీసులకు చిక్కిన ఘనట ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలను మల్కాజిగిరి డీసీపీ జానకి ధారావత్, మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డితో కలిసి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి ప్రాంతానికి చెందిన బండిరాల అవినాష్(29) రాపిడో బైక్ రైడర్. బోడుప్పల్‌లో నివాసముంటున్నాడు. కరీంనగర జిల్లా మానకొండూరు ప్రాంతానికి చెందిన కల్వ రఘు(25) సింగరేణి ఉద్యోగి. బోడుప్పల్ ద్వారకానగర్‌లో నివాసముంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన కొమిర సతీష్(30) కారు డ్రైవర్. వీరు ముగ్గురు స్నేహితులు. కాగా బండిరాల అవినాష్ కుటుంబ సమేతంగా బోడుప్పల్ ద్వారకనగర్‌లో ఉంటున్నాడు. వీరి ఇంటికి సమీపంలోనే స్నేహితులిద్దరూ ఉంటున్నారు. వీరు ముగ్గురు గంజాయికి అలవాటు పడ్డారు. ఈజీగా డబ్బులు సంపాదించాలనే కోరికతో కొత్తగూడెం నుంచి గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లు చేసి నగరంలోని యువతకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరిపై పోలీసులు నిఘా ఉంచారు. 17వ తేదీ ఉదయం 6 గంటల ప్రాంతంలో పర్వతాపూర్ ప్రాంతానికి చెందిన కాలే నిషాల్(29) ట్రాన్స్‌పోర్టు కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌కు గంజాయి విక్రయించేందుకు అవినాష్ బ్యాగ్‌తో అక్కడికి వచ్చాడు. అక్కడ మాటువేసి ఉన్న పోలీసులు వీరిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయాన్ని బయటపెట్టారని డీసీపీ వెల్లడించారు. వీరి వద్ద నుంచి 4.2 కిలోల పొడి గంజాయి, 2 ద్విచక్ర వాహనాలు, 4 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నలుగురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఉప్పల్ సీఐ గోవింద్‌రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



రఘు



నిషాల్



అవినాష్




సతీష్

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మల్లాపూర్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 12వ తేదీన మల్లాపూర్ నోమా థియేటర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని ద్విచక్రవాహనదారుడు అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అతడిని గాంధీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతున్న అతడు శుక్రవారం మృతి చెందాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



గౌతంనగర్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని మల్కాజిగిరి భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ కోమలి అన్నారు. మల్కాజిగిరి భాష్యం పాఠశాల ఆవరణలో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నారు. భాష్యం విద్యా సంస్థల సీఈఓ చైతన్య, జోనల్ ఇన్‌చార్జి మార్కండేయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌పై కక్ష

- పనులను ముందుకు సాగనివ్వని రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్రం నిధులు ఇచ్చినా ఎక్కడి పనులు అక్కడే..
- రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి పనులు చేపడతాం
- ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్



ఉప్పల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

ఉప్పల్: ఉప్పల్ అభివృద్ధికి రూ.650 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు చేపడితే రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టి ప్రాజెక్టును ముందుకు పోనివ్వడం లేదని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. ప్రజాగోస– బీజేపీ భరోసాలో ఉప్పల్ మహంకాళి దేవాలయం ప్రాంగణంలో మహంకాళి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పల్ రహదారి విస్తరణకు సహకరించిన భవన యాజమానులకు పరిహారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని దుయ్యబట్టారు. రహదారి విస్తరణలో పైప్‌లైన్ షిఫ్టింగ్, విద్యుత్ స్తంభాల తొలగింపు, వీధిలైట్ల తొలగింపు పనులకు కేంద్రం నేరుగా నిధులు ఇచ్చినా ఇప్పటి వరకు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి పనులు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో గోరిగే కృష్ణ, జాజుల నగేష్, తీగ విఠల్‌రావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

మల్లాపూర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అవినీతి పాలనను అంతం చేసేవరకు బీజేపీ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పార్టీ మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నాచారం డివిజన్ పరిధిలో రాఘవేంద్రనగర్ కాలనీలో ప్రజాగోస– బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయక్, జిల్లా అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, సమన్వయ కర్త బాలచందర్, డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్, అనితారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు యేగేశ్వర్‌రెడ్డి, ఉదయ్ కిరణ్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అందరికీ నష్టం

వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అన్ని విధాలుగా మోసపోయారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, 4వ డివిజన్ కార్పొరేటర్ కొత్త స్రవంతిగౌడ్ ఆధ్వర్యంలో బోడుప్పల్‌లో 3వ రోజు చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెక్చరర్స్ కాలనీ, శివపురి ఫేజ్–4, ఎన్ఐఎన్ కాలనీ, యాదాద్రి కాలనీ, భవానీనగర్, తారాపురి కాలనీ, అనఘాపురి కాలనీ, గ్రీన్ సిటీ కాలనీ, శ్రీలక్ష్మీనగర్, జయశంకర్ కాలనీల్లో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగ యువత, కుల వృత్తులవారు, రైతులు, అన్ని విధాలుగా నష్ట పోయారన్నారు. కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, యూత్ అధ్యక్షులు పొన్నం తరుణ్‌గౌడ్, నేతలు వరలక్ష్మి, పోగుల వీరారెడ్డి, సింగిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్‌గుప్త, చీరాల జంగయ్య, అసర్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.



గడప గడప కార్యక్రమంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



కంటి వెలుగు కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్

బోడుప్పల్: 18వ డివిజన్ ఈస్ట్ హనుమాన్‌నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వాళ్లు కళ్ల అద్దాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ పులకండ్ల హేమలతారెడ్డి, నేతలు పులకండ్ల జంగారెడ్డి, కొత్త రవిగౌడ్, డివిజన్ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గడ్డం నరేందర్‌కుమార్ పాల్గొన్నారు.

నందీశ్వరాలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు

మల్లాపూర్: మహాశివరాత్రి సందర్భంగా మల్లాపూర్ నందీశ్వరాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. దేవాలయం ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఉదయం నుంచే రుద్రాభిషేకాలు, రాత్రి శివరాత్రి కల్యాణం, అనంతరం శివపార్వతుల ఊరేగింపు ఉంటుందన్నారు. శ్రీహరిగౌడ్, నాగరాజు, రాజేష్, సాయి, రఘు తదితరులున్నారు.



నందీశ్వరాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి

మౌలాలి: మౌలాలి డివిజన్ హనుమాన్‌నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ హాజరై మాట్లాడుతూ.. హనుమాన్‌నగర్‌లో ప్రధాన సమస్య శ్మశానం, ప్రధాన రహదారి అని, రెండు సంవత్సరాలుగా అధికారులకు ఈ సమస్యపై విన్నవిస్తున్నారన్నారు. త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ఫిల్టర్



చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: గిఫ్ట్ స్మైల్ ప్రోగ్రాంలో భాగంగా బీఆర్‌ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలకు అధునాతన వాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, జంపాల్‌రెడ్డి, ఎంకిర్యాల నర్సింహ, చెన్నయ్య, మన్మోహన్‌రెడ్డి, వినయ్, శివ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏకు ఏకసభ్య కమిటీ నియామకంపై హర్షం

రామంతాపూర్: ఉప్పల్ క్రికెట్ స్టేడియం ప్రాంగణంలో శుక్రవారం హెచ్‌సీఏ మాజీ కార్యవర్గ సభ్యులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు హర్షద్ ఆయూబ్, మాజీ కార్యదర్శి శేషు నారాయణ, మాజీ ఉపాధ్యక్షులు జాన్ మనోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కమిటీ రద్దు చేసి ప్రస్తుతం ఉన్న కమిటీ స్థానంలో మాజీ జడ్జి లావణ్య నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తున్నామన్నారు. గతంలో జరిగిన ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్‌లో టికెట్ల కుంభకోణాలతో పాటు హెచ్‌సీఏ అధ్యక్షులు చేసిన అరాచకాలను ఏకసభ్య కమిటీకి వివరిస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఏకసభ్య కమిటీ సభ్యుడు నాగేశ్వర్‌రావును కోరతామన్నారు.



సమావేశంలో హెచ్‌సీఏ మాజీ కార్యవర్గ సభ్యులు